సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

గురువారం । 10 । జూలై । 2025



నేడు మహాశాకంబరీ అలంకరణ

ఓరుగల్లు నగరంలోని భద్రకాళి ఆలయంలో నేడు (గురువారం) అమ్మవారిని మహాశాకంబరీ దేవిగా అలంకరించనున్నారు. వేలాదిగా భక్తులు రానున్నారు. - 8లో▸



సమస్యలు పరిష్కరించకుంటే అంధకారమే.. - 8లో▸

విద్యుత్ ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రాన్ని అంధకారంలోకి తీసుకెళ్తామని టీవీఏసీ జాక్ నాయకులు అన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32° /25°

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ సాధారణంగా ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అట్టహాసంగా 'ఐ-స్టెమ్ సమావేశ-12'



కాజీపేట అర్బన్: తెలంగాణలో తొలి ఐ-స్టెమ్ సమావేశాన్ని 'ఐ-స్టెమ్ సమావేశ-12' పేరిట నిట్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించారు. నిట్ స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ శ్రీనివాస రావు ఆధ్వర్యంలో ఐ-స్టెమ్ వెబ్‌పోర్టల్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. భారతదేశంలో శాస్త్రీయ అభివృద్ధిని వేగవంతం చేసేందుకు నిట్ వరంగల్, ఓప్సా (ఆఫీస్ ఆఫ్ ది ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్) సౌజన్యంతో ఐ-స్టెమ్(ఇండియన్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ ఫెసిలిటీస్ మ్యాప్) వెబ్‌పోర్టల్ తోడ్పడుతుందన్నారు. నిట్‌లోని సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రొఫెసర్లు హరిలాల్, శిరీష్, వీరేశ్‌బాబు, రవికుమార్, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులంలో ఆకస్మిక తనిఖీ



న్యూశాయంపేట: హనుమకొండ జిల్లా పరిధి ఒగ్లాపూర్ సైలానీబాబా దర్గా వద్ద ఉన్న పరకాల(బీ1) బాలుర మైనార్టీ గురుకులాన్ని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి(డీఎండబ్ల్యూఓ) కేఏ గౌస్ హైదర్ బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుశాతం, మైనార్టీ, నాన్‌మైనార్టీ సీట్ల కేటాయింపు వివరాల్ని ప్రిన్సిపాల్ రమేశ్‌లాల్ హట్కర్‌ను అడిగి తెలుసుకున్నారు. 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో సీట్లు ఏ మేరకు భర్తీ అయ్యాయో ఆరా తీశారు. కిచెన్ హాల్, డైనింగ్, స్టోర్‌రూమ్‌ను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

తహసీల్దార్లకు స్థానచలనం

హన్మకొండ అర్బన్: జిల్లాలో తహసీల్దార్లకు స్థానచలనం కల్పిస్తూ కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇతర జిల్లా నుంచి ఇటీవల వచ్చిన తహసీల్దార్ రాణికి నడికూడ తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇచ్చారు. నడికూడ తహసీల్దార్‌గా ఉన్న రవీందర్‌రెడ్డిని హనుమకొండకు బదిలీ చేశారు. అదే విధంగా కలెక్టరేట్‌లో ఎన్నికల విభాగ సూపరింటెండెంట్‌గా ఉన్న ఏవీఎస్ ప్రసాద్‌ను ఎల్కతుర్తి తహసీల్దార్‌గా నియమించారు. ఎల్కతుర్తిలో పని చేస్తున్న జగత్‌సింగ్‌ను కలెక్టరేట్‌కు బదిలీ చేశారు.

బీఎస్‌ఎన్‌ఎల్ లీగల్ కౌన్సిల్‌గా వీరభద్రరావు



వరంగల్ లీగల్ : వరంగల్ జిల్లా కోర్టు పరిధిలో గల కేసుల్లో బీఎస్‌ఎన్‌ఎల్ పక్షాన న్యాయవాదిగా పి.వీరభద్రరావును నియమిస్తూ ఆ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు వీరభద్రరావు ఈపదవిలో మార్చి -2026వరకు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడేదాక కొనసాగుతారని పేర్కొన్నారు. ఈమేరకు వీరభద్రరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా వీరభద్రరావును పలువురు న్యాయవాదులు కలిసి అభినందనలు తెలిపారు.

ఇంతేజార్ గంజ్ సీఐకి అత్యుత్తమ పురస్కారం




వరంగల్ చౌరస్తా: విధుల్లో అత్యుత్తమ సేవలందించినందుకు కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మక సేవ పతకానికి వరంగల్ ఇంతేజార్ గంజ్ సీఐ షుఖూర్ ఎంపికయ్యారు. ఈమేరకు బుధవారం కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఉత్తమ సేవలకు గాను అవార్డును ఎంపిక చేశారు. ఈసందర్భంగా సీఐ షుఖూర్‌కు సీఐలు, ఎస్ఐలు, పోలీసులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నేడు మేధస్సు సంపత్తి హక్కులపై అవగాహన

రామన్నపేట: నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం (నేడు) 'ఆవిష్కరణను ప్రోత్సహించడం, సృజనాత్మకతను పరిరక్షించడం' అంశంపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ బుధవారం తెలిపారు. పేటెంట్లు, ట్రేడ్‌మార్క్‌లు, డిజైన్లు, కాపీరైట్లు, భౌగోళిక సూచికలు వంటి అంశాలపై నిపుణుల ద్వారా ఉపన్యాసాలు, అనుభవాల వివరణలు ఉంటాయని పేర్కొన్నారు. వివరాలకు 94910 56452, 99124 22004 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

లక్ష్యం @ 15.50 లక్షలు

- వారం రోజుల్లో వన మహోత్సవానికి శ్రీకారం
- ప్రతీ ఇంటికి 6 మొక్కల పంపిణీకి ఏర్పాట్లు
- కార్యాచరణ రూపొందించిన బల్దియా ఉద్యాన శాఖ అధికారులు



భట్టుపల్లి నర్సరీలో పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కలు

వరంగల్ అర్బన్: నగరం విస్తరిస్తోంది. చెట్లు నరికివేతకు గురవుతున్నాయి. అకాల వర్షాలు వణికిస్తున్నాయి. వరదలు లోతట్టు ప్రాంతాల్ని ముంచెత్తుతున్నాయి. వాతావరణంలో పెను మార్పులు సంభవిస్తున్నాయి. ప్రకృతి సమతుల్యతను పెంపొందించేందుకు.. చారిత్రక, వారసత్వ ఓరుగల్లు నగరాన్ని వనాలకు కేరాఫ్‌గా నిలిపేందుకు కార్యాచరణ పూర్తయ్యింది. సీఎం రేవంత్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ ఆదేశాల మేరకు జీడబ్ల్యూఎంసీ అధికారులు కసరత్తు పూర్తి చేశారు. ఇటీవల 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో అధికారికంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు రంగం సిద్ధం చేశారు. ఆగస్టులో వారం వ్యవధిలో 15.50 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకుగాను బల్దియా పరిధిలో 10.50 లక్షల మొక్కలు నర్సరీల్లో అందుబాటులో ఉన్నాయి. మరో 5 లక్షల మొక్కలు దిగుమతి చేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

తట్టుకునేలా..

నగర వాతావరణంలో సులువుగా, బలమైన వేర్లతో వృద్ధి చెందే దేశీ జాతి మొక్కలకు వన మహోత్సవంలో అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అవసరమైన చోట రావి, దారి పొడవునా, పార్కులు, సంస్థల్లో నీడనిచ్చే మొక్కలు పెంచుతామంటున్నారు. గాలి, వానను తట్టుకుని నిలిచే వాటిపై దృష్టిపెట్టనున్నట్లు స్పష్టం

హరిత నగరానికి అన్ని ఏర్పాట్లు

చేస్తున్నారు.

ఇంటికి ఆరు మొక్కలు

నగర వ్యాప్తంగా ఒక్కో ఇంటికి 6 మొక్కలు పంపిణీ చేయాలని బల్దియా ఉద్యాన శాఖ అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. ఆయా డివిజన్లలో అందుబాటులో ఉన్న వాటర్ ట్యాంకులు, పార్కులు, నర్సరీల్లో వీటిని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. పలు రకాల పండ్లు, పూల జాతులు, నీడనిచ్చే మొక్కల్ని అందజేయనున్నారు. అదేవిధంగా ప్రధాన రహదారుల పక్కన, కాలనీ రోడ్లు, అంతర్గత రహదారులు, మోడల్ కాలనీల వెంట మాస్టర్ ప్లాన్‌కు సంబంధించిన 80,60 ఫీట్ల రహదారుల్లో మల్టీ రో-అవెన్యూ మొక్కలతో అలంకరణ జాతులకు చెందిన మొక్కలను అవెన్యూ ప్లాంటేషన్ కింద విస్తృతంగా నాటనున్నారు.

60.3 ఎకరాల్లో..

నగరవ్యాప్తంగా ఉన్న లే-ఔట్ స్థలాలు 60.3 ఎకరాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో విరివిగా మొక్కలు నాటనున్నారు. టీఆర్టీ కాలనీ 3,407, పుప్పాలగుట్ట 2,816, లక్ష్మీమెగా టౌన్‌షిప్ గ్యాప్‌లో 150, లక్ష్మీ మెగా టౌన్ షిప్‌లో 2,200, అక్షర టౌన్ షిప్‌లో 145, మామునూరులో 168, ఉర్సు మంకీ ఫుడ్ కోర్ట్ 175, పైడిపల్లి ఓపెన్ స్పేస్‌లో 2,200, రెడ్డి పాలెంలో 450, పలివేల్పులలో 550, శంభునిపేట మియావాకి ప్రాంతంలో 13,200, కనకదుర్గ కాలనీ పార్కులో 8,976, ఇతర ప్రాంతాల్లో 12,063 మొక్కలు నాటనున్నారు.

అవెన్యూ ప్లాంట్స్

నగర వ్యాప్తంగా ఉన్న 149 కిలోమీటర్ల పరిధి 42 రహదారుల్ని గుర్తించారు. అందులో 26,335 మొక్కలు నాటనున్నారు. అంతేకాకుండా మీడియం, జంక్షన్లు 65.95 చదరపు కిలోమీటర్లు ఉండగా.. 3,23,465 మొక్కలు నాటాలని నిర్ణయించారు. అదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, ఆస్పత్రులు, హాస్టళ్ల తదితర 16 ప్రాంతాల్లో ఇన్‌స్టలేషన్ ప్రాంతాల్లో 45,800 మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. మడికొండ ఓఆర్ఆర్‌లో 6 ప్రాంతాల్లో 1,000 మొక్కలు, విద్యుత్ నగర్ 1,000 మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఇవేకాకుండా చెరువులు, గట్లు 18 ప్రాంతాల్లో 32 వేల మొక్కలు నాటనున్నారు. ఖాళీ స్థలాలతోపాటు, శ్మశాన వాటికల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు ప్రతిపాదనలు రూపొందించారు.

అందరినీ భాగస్వాముల్ని చేస్తాం..



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న వన మహోత్సవాన్ని నగరంలో అమలు చేసేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం. మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, స్లమ్ సమాఖ్యల ప్రతినిధులను, కాలనీ అసోసియేషన్, వేల్ఫేర్ కమిటీ ప్రతినిధులను, స్వచ్ఛంద, యువజన సంఘాలందరినీ ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తాం. – రమేశ్, బల్దియా ఉద్యానవన అధికారి

'కార్పొరేట్'కు ఊడిగానికే 4 లేబర్ కోడ్‌లు





హనుమకొండ కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహిస్తున్న వివిధ కార్మిక సంఘాల నాయకులు, వరంగల్‌లో ర్యాలీ తీస్తున్న కార్మిక సంఘాల నాయకులు

వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా

హన్మకొండ అర్బన్ : కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేసేందుకు నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, లేబర్ కోడ్‌లు రద్దు అయ్యేంత వరకు ఉద్యమాలు ఆగవని సీపీఐ, సీపీఎం, ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శులు కర్రె భిక్షపతి, గాదె ప్రభాకర్ రెడ్డి, హంసరెడ్డి, సీపీఐ(ఎంఎల్), ఆర్ఎస్పీ జిల్లా నాయకులు గంగుల దయాకర్, కొడగాని శివాజీలు అన్నారు. బుధవారం సార్వత్రిక సమ్మెకు మద్దతుగా వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏకశిలా పార్కునుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ దేశంలో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కార్మిక చట్టాలను కాలరాస్తూ 4 లేబర్ కోడ్‌లు తీసుకువచ్చి ఎనిమిది గంటల పని విధానాన్ని ఎత్తివేసి, కార్మికుల సమ్మె హక్కును కాలరాస్తోందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు సిరబోయిన కరుణాకర్, అదరి శ్రీనివాస్, ఎస్ఏ స్టాలిన్, తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, బొట్ల చక్రపాణి, ఎం. చుక్కయ్య, రాగుల రమేష్, గౌడుగు వెంకట్, నున్నా అప్పారావు, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, జక్కు రాజ్ గౌడ్, బత్తిని సదానందం, నేదునూరి వెంకట్రాజం, కొట్టిపాక రవి, నేదునూరి రాజమౌళి, మునిగాల భిక్షపతి, వేల్పుల సారంగపాణి, ధర్మల రాంమూర్తి, కార్మికులు పాల్గొన్నారు. కాగా, సమ్మెకు వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.

కదం తొక్కిన కార్మికులు

వరంగల్ అర్బన్ :కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తోన్న కార్మిక శ్రమ దోపిడీ విధానాలను నిరసిస్తూ బుధవారం నగరంలో చేపట్టిన సార్వత్రిక సమ్మెలో కార్మికులు, పలు యూనియన్ల నాయకులు కదం తొక్కారు. వివిధ యూనియన్ల నాయకులు కార్మికులతో కలిసి వ్యాపార, వాణిజ్య సంస్థలను బంద్ చేయించి, పెద్ద ఎత్తున నిరసన ర్యాలీలు నిర్వహించారు. బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలోకార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని నినాదాలు చేశారు. దీంతో నగర వ్యాప్తంగా చెత్త సేకరణ, వివిధ పనులు నిలిచిపోయాయి. కార్యక్రమంలో ఉప్పలయ్య, సింగారపు బాబు, జన్ను ప్రకాశ్, తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు. వరంగల్ పాత రామా టాకీస్‌నుంచి పాత బీట్ బజార్ మీదుగా వరంగల్ చౌరస్తా వరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఎండీ యాకూబ్ నాయకులు శంకర్, గొల్లపల్లి రమేష్ ,కోలా రాజ్ కుమార్, రమేష్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు. సమ్మెకు టీడబ్ల్యూజేఎఫ్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు. వరంగల్ ఎంసీపీఐ(యూ) ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దరపు రమేష్ మాట్లాడారు. అదేవిధంగా వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్, పండ్ల , కూరగాయాల మార్కెట్లలో సమ్మెలో వివిధ సంఘాల నాయకులు పెద్దఎత్తున పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

మార్కెట్లను ఆధునీకీకరించాలి

- కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్
- కాజీపేట, బాలసముద్రంలో తనిఖీ



బాలసముద్రంలోని బయోగ్యాస్ ప్లాంట్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

వరంగల్ అర్బన్/కాజీపేట రూరల్: కూరగాయలు, పండ్లు, చేపలు, ఇతర వస్తువులు మార్కెట్లలో అందుబాటులో ఉండేలా ఆధునీకరించి, వినియోగంలోకి తీసుకురావాలని గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కాజీపేట, హనుమకొండ బాలసముద్రంలోని కూరగాయల మార్కెట్, బయోగ్యాస్ విద్యుత్ ఆధారిత విద్యుత్ ప్లాంట్‌ను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా కాజీపేట, బాలసముద్రం మార్కెట్లకు సంబంధించి వెజ్, నాన్‌వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీర్లను హెచ్చరించారు. అయా మార్కెట్లలో కూరగాయల విక్రయాలు జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మార్కెట్లలో, ఇళ్లల్లో వెలువడుతున్న చెత్తను బయోగ్యాస్ విద్యుత్ ఆధారిత ప్లాంట్లకు తరలించాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలోని ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో అమల్లోకి తీసుకురావాలన్నారు. పోలీస్, పట్టణ ప్రణాళిక విభాగం ఇంజనీరింగ్ విభాగాల సమన్వయంతో స్ట్రీమ్ లైన్ చేసి వీధి వ్యాపారులకు ఉపాధి అందేలా చూడాలన్నారు. బాలసముద్రంలోని కోకో పిట్ యూనిట్‌ను పరిశీలించిన కమిషనర్ నిర్వహణ బాగుందని, ఈయూనిట్ కార్పొరేషన్‌కు మోడల్‌గా నిలుస్తుందన్నారు. ఈతనిఖీల్లో సీఎంహెచ్ఓ రాజారెడ్డి, వెటర్నరీ వైద్యుడు గోపాలరావు, ఈఈ రవికుమార్, డీఈ సారంగం తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు..

హన్మకొండ చౌరస్తా: కార్మిక శాఖ ద్వారా పొందాల్సిన లబ్ధి కోసం దళారుల్ని నమ్మి మోసపోవద్దని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ వినీత కార్మికులు, కార్మిక కుటుంబాలను కోరారు. ఇటీవల తమ విచారణలో అవి నకిలీవని తేలడంతో తిరస్కరిస్తున్నట్లు ఆమె బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈనేపథ్యంలో కొంతమంది వ్యక్తులు కార్మిక శాఖ అధికారులపై బెదిరింపులకు, బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని, కొన్ని మీడియా నివేదికలు అధికారులపై తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతీ కార్మికులకు, వారి కుటుంబాలకు లబ్ధిచేకూర్చడంలో తమ అధికారులు నిత్యం అందుబాటులో ఉంటారని, ఏదైనా సందేహం ఉంటే తమను నేరుగా సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కార్మికశాఖ అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తే ఏసీబీని సంప్రదించాలని సూచించారు. భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులు రూ.110 చెల్లించి నమోదు చేసుకోవాలని, తద్వారా కార్మిక శాఖ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులు కావొచ్చని పేర్కొన్నారు.

అనధికారిక లేఔట్లపై కొరడా ఝుళిపించాలి

- మున్సిపల్ స్థలాలను పరిరక్షించాలి
- సమీక్షలో మేయర్ గుండు సుధారాణి



మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్ అర్బన్: నగరవ్యాప్తంగా ఉన్న అనధికారిక లేఔట్లను గుర్తించి కొరడా ఝుళిపించాలని మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. బుధవారం వరంగల్ నర్సంపేట రోడ్డులోని స్తంభంపల్లి 467, 471 సర్వే నంబర్లలో అనధికారిక లేఔట్ హద్దులను బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చేశారు. అనంతరం బల్దియా కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనధికారిక లేఔట్లు, ప్లాట్లను ప్రజలు కొనొద్దని, ప్రజల్లో చైతన్యం కల్గించడానికి టౌన్ ప్లానింగ్ విభాగం వివిధ సామాజిక మాధ్యమాలు కరపత్రాలు ఫ్లెక్సీల ద్వారా అవగాహన కలిగించాలన్నారు. మున్సిపాలిటీకి చెందిన ఓపెన్ ప్లాట్లు ప్రహరీ లేని మున్సిపల్ స్థలాలు పార్కులు, బల్దియాకు చెందిన ప్రాపర్టీలని సూచించేలా బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వర్షాకాలం వరదలను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు, ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు శ్రీనివాస్‌రెడ్డి, రజిత, ఏర్షాద్, ప్రశాంత్, టీపీబీఎస్‌లు, టీపీఓలు తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ స్పెషాలిటీ' పనులు పూర్తిచేయాలి

- ఆస్పత్రిలో వసతుల కల్పనకు సూక్ష్మప్రణాళిక నివేదిక సమర్పించాలి
- అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధుల సమీక్షలో వరంగల్ కలెక్టర్ సత్యశారద



ఆస్పత్రి నిర్మాణం గురించి కలెక్టర్ సత్యశారదకు వివరిస్తున్న అధికారులు

ఎంజీఎం: వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. ఆయా క్లినికల్ విభాగాల్లో వసతులు కల్పించేందుకు పూర్తి వివరాలతో కూడిన సూక్ష్మ ప్రణాళిక నివేదికను 15 రోజుల్లోగా సమర్పించాలని పేర్కొన్నారు. వరంగల్ సెంట్రల్ జైలు ప్రాంగణంలో నిర్మిస్తున్న సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి సమావేశ మందిరంలో వైద్యాధికారులు, ఆర్అండ్‌బీ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పిడియాట్రిక్స్, జనరల్ సర్జరీ, రేడియాలజీ, పాథాలజీ, ఫోరెన్సిక్, అనస్థీషియా, ఆర్థోపెడిక్ తదితర క్లినికల్ విభాగాలకు ఏ భవనాల్లో గదులు కేటాయించారు, ఇంకా మిగిలిన విభాగాలకు ఏ అంతస్తుల్లో గదులు కేటాయించాలి, మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించారు. అనంతరం ఆస్పత్రిలో నిర్మాణమవుతున్న 24 అంతస్తుల్లో పలు అంతస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పలు కీలక అంశాలపై నిర్మాణ ప్రతినిధులకు సూచనలు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సూక్ష్మ ప్రణాళికలు సిద్ధం చేస్తే ఆయా శాఖలకు కేటాయించాల్సిన వనరులు, వసతులు కల్పించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. ఎంజీఎం ఆస్పత్రిలో పనిచేస్తున్న వివిధ పరికరాలను ఇక్కడికి తరలించాల్సిన అవసరం ఉందన్నారు. వీటికి అదనంగా కొత్త పరికరాలను సంబంధిత శాఖ ద్వారా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్, ఎల్అండ్‌టీ అధికారి శరవరన్, జిల్లా ఆర్అండ్‌బీ అధికారి రాజేందర్, టీఎస్ఎంఎస్ఐడీసీ డీఈ, ఆర్ఎంఓలు, అధికారులు పాల్గొన్నారు.

ముందుకు సాగని వానాకాలం

ఉమ్మడి వరంగల్ జిల్లాకు కలిసిరాని సీజన్

- గత సీజన్‌లో ఇప్పటికే 74శాతం.. ఈ సారి 34.50 శాతానికే పరిమితం
- సాగు అంచనా 15.83 లక్షల ఎకరాలు.. ఇప్పటికీ అయ్యింది 5.46 లక్షల ఎకరాలు
- ఆరు జిల్లాల్లో లోటు వర్షపాతం



ధర్మసాగర్ మండలం దేవునూరులో పత్తి మొక్కలకు రెయిన్ గన్నులతో నీరందిస్తున్న రైతు రామారావు

సాక్షిప్రతినిధి, వరంగల్:

ఉమ్మడి జిల్లా రైతులకు ఈ వానాకాలం అనుకూలించడం లేదు. గతేడాది ఇదే సమయంలో కురిసిన భారీ వర్షాలకు జలాశయాలు, చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి కానీ, ఈ సీజన్‌లో రైతులకు ఆ పరిస్థితి లేదు. మే నెలలో కురిసిన వర్షాలకు కొందరు దుక్కులు దున్నుకుని పత్తి విత్తనాలను వేస్తే.. మరికొందరు పొలాలు సిద్ధం చేసుకుని నారు పోసుకున్నారు. ఆ తర్వాత ఆశించిన స్థాయిలో వర్షాలు లేక చాలా వరకు పత్తి, మొక్కజొన్న విత్తనాలు భూమిలో ఎండిపోగా.. పొలాలు దున్నిన రైతులు సైతం ఇప్పటికీ వేచిచూసే ధోరణిలోనే ఉన్నారు. వానాకాలం మొదలై 40 రోజులు గడుస్తున్నా.. ఇప్పటికీ లోటు వర్షపాతమే ఉంది. దీంతో జలాశయాలు, చెరువులకు నీరు చేరక.. పెరిగిన భూగర్భజలాలూ అంతంతే కావడంతో రైతులకు ప్రతికూల పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

అదును దాటుతున్నా సాగు 34.50 శాతమే..

మే 28, 30 తేదీల్లో ముందస్తుగానే వర్షాలు పడటంతో సాగు విస్తీర్ణం అంచనాలు దాటుతుందని అందరూ భావించినా.. ప్రస్తుత పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. గతేడాది వానాకాలంలో 14.15 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని భావించగా, 15.45 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు వేశారు. గత సాగును దృష్టిలో పెట్టుకుని ఈ సీజన్‌లో ఉమ్మడి వరంగల్‌లో 15,82,755 ఎకరాల్లో రైతులు వివిధ పంటలు వేస్తారని వ్యవసాయశాఖ అంచనా వేసింది. కానీ, వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈసారి సాగు ముందుకు కదలడం లేదు. గతేడాది ఇదే సమయానికి 74 శాతం వరకు పంటలు వేయగా.. అదును దాటుతున్న ఇప్పటికీ ఉమ్మడి జిల్లాలో 5,46,138 (34.50 శాతం) ఎకరాల్లోనే సాగు చేశారు. ముందస్తుగా ఒకటి రెండు వర్షాలు పడినా.. ఆశించిన మేర వర్షపాతం నమోదు కాలేదు. దీంతో సాగు పెరగలేదని, ఇంకా సమయం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

లోటు వర్షపాతం.. వరిసాగు 6.39 శాతం

జనగామ జిల్లాల్లో 47 శాతం, జయశంకర్ భూపాలపల్లిలో 30 శాతం లోటు వర్షపాతం ఉండగా.. మహబూబాబాద్‌లో సాధారణ వర్షపాతానికంటే 18 శాతం తక్కువగా నమోదైంది. అలాగే వరంగల్‌లో 23, ములుగులో 32, హనుమకొండలో 30 శాతం తక్కువగా ఉంది. ఈనేపథ్యంలో గతంతో పోలిస్తే సాగు తగ్గినా.. రైతులు కష్టకాలంలోనూ వర్షాధార పంటగా పత్తిని ఎంచుకున్నారు. 5,76,863 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని అంచనా వేయగా, ఇప్పటి వరకు 4,07,554 (70.28 శాతం) ఎకరాల్లో వేశారు. కాగా 8,78,376 ఎకరాల వరిసాగు అంచనాకు కేవలం 56,155 (6.39 శాతం) ఎకరాల్లోనే వరి పంటలు వేయడం ఈసారి ప్రతికూల పరిస్థితులకు అద్దం పడుతోంది.

హెచ్‌ఎం, సీఆర్పీలకు షోకాజ్ నోటీస్

విద్యారణ్యపురి: హనుమకొండలోని బాసిత్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం హేమ్లాకు బుధవారం షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు డీఈఓ వాసంతి తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు ఫేస్ రికగ్నిజేషన్ సిస్టమ్‌ను అమలు చేయడంలో అలక్ష్యం వహిస్తున్నందుకు, ఇటీవల పాఠశాల తనిఖీలో విధుల్లో నిర్లక్ష్యం వహించినట్లు వెల్లడైనందుకు షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఈనెల 8న కలెక్టర్ స్నేహ శబరీష్ హనుమకొండ ఎంఆర్సీని సందర్శించారు. ఆసమయంలో ఐదుగురు సీఆర్పీలు.. వారికి కేటాయించిన విధులు నిర్వర్తించకుండా ఎంఆర్సీ భవనంలోనే ఉన్నారు. వారు సైతం మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని డీఈఓ వాసంతి షోకాజ్ నోటీస్‌లో పేర్కొన్నారు.

క్లుప్తంగా

నేడు గురుపౌర్ణమి

- సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు



హనుమకొండ బస్టాండ్ సమీపంలోని షిర్డీ సాయిబాబా మందిరం

హన్మకొండ కల్చరల్: ఆషాఢ శుద్ధ పూర్ణిమనే వ్యాస పూర్ణిమ అంటారు. వేద సంహితలను రాసిన వ్యాసభగవానుడిని పూజిస్తారు. వ్యాస భగవానుడు వ్యక్తికాదని గురువే అని భావించే వారు గురుపౌర్ణమిగా జరుపుకుంటారు. భక్తులు సాయిమందిరాల్లో ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో గురువారం హనుమకొండ బస్టాండ్ సమీపంలోని షిర్డీ సాయిబాబా మందిరం, యాదవనగర్‌లోని సాయిబాబా ఆలయం, పద్మాక్షీనగర్‌లోని సాయిబాబా ఆలయం, భద్రకాళి దేవాలయం దగ్గర ఉన్న సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా ఉత్సవాలు నిర్వహిస్తారు. కాగా, హనుమకొండ బస్టాండ్ సమీపంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం ఉదయం 5 గంటల నుంచి ప్రభాతసేవ, 6 గంటలకు మంగళస్నానం, ఉదయం 8 నుంచి 11గంటల వరకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి, సాయంత్రం 5గంటలకు పూజలు ఉంటాయని చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ తెలిపారు.

పత్తి పంటలో యాజమాన్య పద్ధతులు..

- రైతులు అవగాహన పెంచుకోవాలి
- కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రాజన్న



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

మామునూరు: పత్తి పంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రాజన్న సూచించారు. ఈ మేరకు బుధవారం మామునూరు, సింగారం, ఒంటి మామిడిపల్లి గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం, మామునూరు వ్యవసాయ శాస్త్రవేత్తలు పత్తి పంటలను క్షేత్ర స్థాయిలో సందర్శించారు. మే చివరి వారం, జూన్ మొదటి వారంలో విత్తుకున్న పత్తి పంటలు, ప్రస్తుతం 30 నుంచి 45 రోజుల వయసులో ఉన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంటలో తామర పురుగులు, పచ్చ దోమ, పేనుబంక, గోధుమ రంగు ముక్కు పురుగు ఉధృతి గమనించారు. వీటి నివారణకు రైతులు పంట తొలి దశ నుంచే సమగ్ర సస్య రక్షణ చర్యలు పాటించాలన్నారు. తామర పురుగుల నియంత్రణకు ఎకరాకు 10 చొప్పున నీలి రంగు జిగురు అట్టలు అమర్చుకోవాలన్నారు.



15 రోజుల్లో.. ఇంటికే ఓటరు కార్డు

- కొత్త విధానాన్ని అందుబాటులోకి తెచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం
- ఓటరు నమోదును ప్రోత్సహించడానికి సరికొత్త మార్గం



మొగుళ్లపల్లి: ఓటరు గుర్తింపు కార్డు ఇక నుంచి దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోనే నేరుగా ఇంటికే రానుంది. ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడంతో పాటు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా కేంద్ర ఎన్నికల సంఘం వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి 15 రోజుల్లోనే ఇంటికే ఓటరు గుర్తింపు కార్డు అందించాలని నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో యువతను చైతన్యపర్చేందుకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

మార్పులు, చేర్పులు కూడా..

ఇదివరకే ఓటరుగా నమోదై జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి సైతం 15 రోజుల్లోనే ఇంటికే ఓటరు కార్డు పంపించనున్నారు. ఇప్పుడు ఉన్న సిస్టమ్ ప్రకారం ఓటర్లకు ఎలక్ట్రోరల్ ఫొటో ఐడెంటిటీ కార్డు చేయడానికి నెలకు పైగా సమయం పడుతుంది. దీని కోసం కేంద్ర ఎన్నికల సంఘం నూతన ప్రామాణిక నిర్వహణ విధానాన్ని ప్రవేశపెట్టింది.

అర్హులు ఓటరుగా నమోదు కావాలి..



అర్హులు ఓటరుగా నమోదు కావాలి. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలి. కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న వారికి 15 రోజుల్లోనే గుర్తింపు కార్డు రానుంది.

-సునీత, తహసీల్దార్, మొగుళ్లపల్లి

దరఖాస్తు ఎలా చేసుకోవాలి?



- 18 ఏళ్లు నిండి ప్రతి ఒక్కరూ ఈసీఐ గవర్నమెంట్ ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ ఫోన్ నంబర్, ఈ–మెయిల్ ఐడీతో సైన్ అప్ కావాలి.
- క్రియేట్ చేసిన అకౌంట్‌పై క్లిక్ చేసి తన పేరు, పాస్‌వర్డ్ నమోదు చేయాలి. తర్వాత పాస్‌వర్డ్ నిర్ధారించాలి.
- సైన్ అప్ అయిన ఈ–మెయిల్ ఐడీకి ఓటీపీ వస్తుంది. దానిని ఎంట్రీ చేసి అందులో ఓటరు వివరాలు నమోదు చేసుకోవాలి. తర్వాత మొబైల్ నంబర్, పాస్‌వర్డ్ నమోదు చేసి ఓటీపీతో లాగిన్ అవ్వాలి.
- కొత్తగా ఓటరు నమోదు చేసుకునే వారు ఫామ్–6తో వ్యక్తిగత వివరాలు, అడ్రస్ తదితర వివరాలు నమోదు చేసి అందులో పేర్కొన్న ధ్రువపత్రాలను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలి. అనంతరం మరోసారి వివరాలను సరిచూసుకుని సబ్మిట్ చేయాలి.
- మార్పులు, చేర్పుల కోసం ఫామ్–8, ఓటరు పేరు తొలగించుకునేందుకు ఫామ్–7 నింపాలి.
- ట్రాక్ అప్లికేషన్ స్టేటస్ పై క్లిక్ చేస్తే దరఖాస్తు చేసిన సమయంలో ఎస్ఎంఎస్ వచ్చిన రెఫరెన్స్ నంబర్‌ను నమోదు చేసి సబ్మిట్ చేస్తే అప్లికేషన్ స్టేటస్ ఎంతవరకు వచ్చిందో తెలుస్తుంది.

‘టీ- హబ్’ను సందర్శించిన వీసీ



టీ-హబ్‌లో వీసీ ప్రతాప్‌రెడ్డి, కేయూ రూసా కోఆర్డినేటర్ మల్లికార్జున్‌రెడ్డి తదితరులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి, విశ్వవిద్యాలయం రూసా నోడల్ ఆఫీసర్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని టీ-హబ్ కార్యాలయాన్ని సందర్శించారు. విశ్వవిద్యాలయం తరఫున ఒప్పందానికి సంబంధించి విధివిధానాలపై చర్చించారు. టీ-హబ్‌లో అందుబాటులో ఉన్న వసతులు, వనరులు, సదుపాయాలను పరిశీలించారు. ఈ వనరుల కాకతీయ యూనివర్సిటీకి కె-హబ్ అభివృద్ధికి ఎలా ఉపయోగపడుతాయనే అంశాలను పరిశీలించారు. టీ-హబ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కవికృత్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌తాలుక్ పాల్గొని కె-హబ్ అభివృద్ధికి టీ-హబ్ తరుపున సహకారం ఉంటుందని తెలిపారని వీసీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

వైద్యం వికటించి వృద్ధుడి మృతి?

- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన
- తొర్రూరులో ఘటన



పాండురంగయ్య (ఫైల్)

తొర్రూరు/ కొడకండ్ల: వైద్యం వికటించడంతోనే వృద్ధుడు మృతి చెందాడని ఆరోపిస్తూ బంధువులు ఆందోళన చేపట్టారు. ఈ ఘటన డివిజన్ కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు పొన్నం పాండురంగయ్య(70) గ్రామాల్లో దుస్తుల విక్రయాలు జరుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. రోజు వారి మాదిరిగానే బుధవారం కూడా గ్రామాలు తిరిగి ఇంటికి చేరుకున్న సమయంలో తీవ్ర కడుపు నొప్పికి గురయ్యాడు. ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లగా తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాలని సూచించాడు. దీంతో తొర్రూరులోని పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకురాగా వైద్యుడు పరీక్షించి ఇంజక్షన్లు, ఇతర వైద్యం చేశాడు. అయినా నొప్పి తగ్గకపోవడంతో స్కానింగ్ తీసుకురావాలని సూచించాడు. దీంతో పట్టణంలోని ఓ స్కానింగ్ సెంటర్‌కు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందగా వృద్ధుడి మృతదేహంతో బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఆందోళనకారులు శాంతించలేదు. చివరకు ఆస్పత్రి తరపున పరిహారం అందేలా కృషి చేస్తామని మధ్యవర్తులు తెలపడంతో మృతదేహాన్ని తీసుకెళ్లారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై ఎస్సై ఉపేందర్ వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

హత్య కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

- తీర్పు వెలువరించిన వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి

వరంగల్ లీగల్ : నగరంలోని ఉర్సు గుట్ట సమీపంలో వనం రాకేశ్ అనే వ్యక్తిని హత్య చేసిన ఘటనలో శివనగర్‌కు చెందిన గాడుదుల రాజేశ్, జున్ను హరికృష్ణ అలియాస్ బంటికి 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.15 వేల చొప్పున జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి నిర్మలా గీతాంబ బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2022, ఆగస్టు 27న వనం రాకేశ్ తన మిత్రులు మరుపట్ల నిఖిల్, శివ, తదితరులతో ఉర్సు గుట్ట సమీపంలోని మహాలక్ష్మి బేకరీ వద్ద ఉన్న సమయంలో కడిపికొండ వైపు నుంచి బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చారు. రాకేశ్, తన మిత్రుల సమీపంలోకి వచ్చి మూత్ర విసర్జన చేస్తుండగా ఇక్కడ చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో రాకేశ్‌తో నిందితులు ఘర్షణ పడుతుండగా రాకేశ్ మిత్రులు నిఖిల్, శివ నివారించారు. దీంతో ఇద్దరు వ్యక్తులు(బైక్‌పై వచ్చిన వారు).. రాజేశ్, హరికృష్ణ అలియాస్ బంటికి ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పగా సుమారు తొమ్మిది మంది అర్ధరాత్రి 11.30 గంటల సమయంలో ఉర్సు గుట్టకు చేరుకుని అక్కడే ఉన్న రాకేశ్, నిఖిల్‌పై దాడి చేశారు. హరికృష్ణ కత్తితో రాకేశ్‌ను పొడవగా అడ్డుకోవడానికి వెళ్లిన తన స్నేహితులు నిఖిల్, శివకు కూడా గాయాలయ్యాయి. ఈ ఘటనపై సమాచారం మేరకు స్థానికులు అంబులెన్స్‌లో బాధితులను ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ మరుసటి రోజు రాకేశ్ మృతి చెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపర్చారు. విచారణలో గాడుదుల రాజేశ్, జున్ను హరికృష్ణ అలియాస్ బంటిపై నేరం రుజువుకావడంతో ఇద్దరికి 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.15 వేల చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి నిర్మలా గీతాంబ తీర్పు వెలువరించారు. ఈ కేసును పోలీస్ అధికారులు శ్రీనివాస్, రమేశ్ పరిశోధించగా లైజన్ ఆఫీసర్ హరికృష్ణ పర్యవేక్షణలో కానిస్టేబుల్ ప్రతాప్, హోంగార్డు సదానందం సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ కేసు వాదించారు.

నేడు మహాశాకంబరీ అలంకరణ



కూరగాయల దండలు అల్లుతున్న శ్రీలక్ష్మీ శ్రీనివాస సేవా సమితి సభ్యులు



ముద్రా, జ్వాలామాలినీ క్రమంలో అమ్మవారు

- భద్రకాళి ఆలయంలో ఏర్పాట్లు పూర్తి
- తరలిరానున్న వేలాది మంది భక్తులు

హన్మకొండ కల్చరల్: నగరంలోని శ్రీభద్రకాళి దేవాలయంలో గురువారం(నేడు) అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలతో మహాశాకంబరీదేవిగా అలంకరించనున్నారు. దేవిగా అమ్మవారి రూపాన్ని దర్శించడానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు రానున్నారు. ఈమేరకు మహబూబాబాద్ శ్రీలక్ష్మీ శ్రీనివాస సేవా సమితి అధ్యక్షుడు జీకే రెడ్డి ఆధ్వర్యంలో సేవాసమితి సభ్యులు ఎనిమిది క్వింటాళ్ల కూరగాయలు అమ్మవారికి సమర్పించారు. బుధవారం రాత్రి సేవాసమితి సభ్యులు కూరగాయలను దండలుగా తయారుచేశారు. అమ్మవారి శాకంబరీ విశ్వరూప దర్శనం గురువారం ఉదయం 9గంటల నుంచి రాత్రి వరకు కొనసాగనుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈఓ శేషుభారతి తెలిపారు.

లోక కల్యాణం కోసమే శాకంబరీ ఉత్సవాలు

వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని శాకంబరీ ఉత్సవాలు నిర్వహించనున్నారు. నేడు ఉదయం నిత్యాహ్నికం నిర్వహించిన అనంతరం 3 గంటల నుంచి శాకంబరీ అలంకరణ ప్రారంభమవుతుంది. 6గంటల పాటు అలంకరణ కొనసాగుతుంది. అలంకరణ సమయంలో భక్తులను అనుమతించరు.



దేవాలయంలో క్యూలైన్ల ఏర్పాటు

అలంకరణ పూర్తయిన తర్వాత అమ్మవారి స్నపనభేరాన్ని మిత్రాక్రమంలో, భోగాభేరాన్ని చిత్రాక్రమంలో పూజలు నిర్వహించి ఉదయం 9గంటల నుంచి భక్తులను సర్వదర్శనానికి అనుమతించనున్నారు.

ముద్రా, జ్వాలామాలినీ క్రమాలలో అమ్మవారికి పూజలు

భద్రకాళి దేవాలయంలో నిర్వహిస్తున్న శాకంబరీ నవరాత్రోత్సవాల్లో భాగంగా 14వరోజు బుధవారం అమ్మవారిని ముద్రా, జ్వాలామాలినీ క్రమాలలో పూజలు జరిపారు. ఆలయ అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేదపండితులు ఉదయం అమ్మవారికి నిత్యాహ్నికం నిర్వహించి అనంతరం కాళీక్రమాన్ని అనుసరించి స్నపనభేరాన్ని ముద్రా అమ్మవారిగా, షోడశీక్రమాన్ని అనుసరించి భోగభేరాన్ని జ్వాలామాలినీ అమ్మవారిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ శేషుభారతి, ధర్మకర్త తొనుపునూరి వీరన్న, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కేంద్రం మొండి వైఖరి వీడాలి



టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

- తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ రాష్ట్ర కోచైర్మన్ శ్రీధర్

హన్మకొండ: విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణపై కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ రాష్ట్ర కోచైర్మన్ ఇనుగాల శ్రీధర్ డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం విద్యుత్ అధికారులు, ఉద్యోగులు విధులు బహిష్కరించి టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 50 లక్షల మంది విద్యుత్ ఉద్యోగులు సమ్మె చేస్తున్నారన్నారు. విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించాలనే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో దేశ వ్యాప్తంగా సమ్మె చేస్తామని హెచ్చరించారు. పేద, మధ్య తరగతి ప్రజలున్న దేశంలో విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించడం సరికాదన్నారు. ఇప్పటికే విద్యుత్ చార్జీలు అధికంగా ఉన్నాయని, ప్రైవేటీకరిస్తే చార్జీలు మరింత పెరిగే ప్రమాదముందన్నారు. దీనిని వినియోగదారులు, రైతులు భరించలేరన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని వీడాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు వేమునూరి వెంకటేశ్వర్లు, బి.సామ్యా నాయక్, ఎన్.సుబ్రహ్మణ్యేశ్వర్ రావు, పి.మల్లికార్జున్, పి.మహేందర్ రెడ్డి, కె.రంగా రావు, ఎ.ఆనందం, ఎన్.కుమారస్వామి, అజ్మీరా శ్రీరాం నాయక్, వాలు నాయక్, బి.ఆంజనేయులు, ఆర్.నవీన్, జె.అరుణ్, ఎల్.శ్రీనివాస్, జె.హర్జీ నాయక్, మచ్చిక బుచ్చయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించకుంటే అంధకారమే

- ఏపీ ఎస్ఈబీ సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలి
- తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ కె. ఈశ్వర్ రావు, కన్వీనర్ ఎం.ఎ.వజీర్



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టిజన్ ఉద్యోగులు

హన్మకొండ: విద్యుత్ ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రాన్ని అంధకారంలోకి తీసుకెళ్తామని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ కె.ఈశ్వర్ రావు, కన్వీనర్ ఎం.ఎ.వజీర్ అన్నారు. విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగులను శాశ్వత ఎంప్లాయ్‌గా కన్వర్షన్ చేయాలని డిమాండ్‌తో జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట మహా ధర్నా చేశారు. అంతకు ముందు హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుంచి ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు సమ్మెకు వెళ్తే రాష్ట్రంలో అంధకారం తప్పదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఇతర శాఖల్లో ఉన్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో ఆర్టిజన్ ఉద్యోగులను పోల్చొద్దన్నారు. ఇది కంపెనీ అని, ఐడీ యాక్ట్ వర్తిస్తుందన్నారు. యాజమాన్యానికి తమకు లేబర్ కమిషనర్ ఎదుట 12(3) ఒప్పందం కూడా కుదిరిందన్నారు. ఆ ఒప్పందాన్ని గత ప్రభుత్వం తుంగలో తొక్కి స్టాండింగ్ రూల్స్ తీసుకొచ్చిందని, ఈ రూల్స్‌కు వ్యతిరేకంగా పది నెలలుగా జరుగుతున్నదే ఈ కన్వర్షన్ పోరాటమన్నారు. ఈ నెల 14 ఉదయం 6 గంటల నుంచి సమ్మె చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ నెల 10న లేబర్ కమిషనర్‌తో చర్చలున్నాయని, ఈ చర్చలు సఫలం కాకపోతే నిరవధిక సమ్మె తప్పదన్నారు. తెలంగాణ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ రాష్ట్ర కోకన్వీనర్ కందికొండ వెంకటేశ్, కోకన్వీనర్ కృష్ణమాచారి. నాయకులు చంద్రారెడ్డి, సలీంపాషా, రఘునాథరెడ్డి, ప్రసాదరాజు, మురళి, ఐలయ్య, రాజన్న, జయచందర్, సృజన, శ్రీనాథ్, శ్రీకాంత్, రాజేందర్ పాల్గొన్నారు.

8 కిలోల ఎండు గంజాయి పట్టివేత

- నలుగురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన వరంగల్ ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాస్ గౌడ్



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌గౌడ్

ఖిలా వరంగల్ : కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయి తరలిస్తున్న నలుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి 8.7 కిలోల సరుకు స్వాధీనం చేసుకున్నామని వరంగల్ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బుధవారం వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. భువనేశ్వర్ నుంచి ముంబాయి వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో డ్రగ్ కంట్రోల్ బృందం సీఐ సతీశ్, ఎస్సై పూర్ణచందర్, ఆర్పీఎఫ్ ఏఎస్సై దుర్గాప్రసాద్, సిబ్బందితో కలిసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో మహారాష్ట్ర డైసర్‌కు చెందిన ఎండి. అష్రఫ్ షేక్, డోంగ్రి శాంతినగర్‌కు చెందిన రహీం బాబన్ పటేల్, ఉత్తర్‌ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్ జిల్లాకు చెందిన రాజు ఠాకూర్, మహారాష్ట్ర రత్నగిరి డైసార్‌కు చెందిన ప్రవీణ్ శ్యామ్ తవుడే అనుమానాస్పదంగా కనిపించారు. వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా అందులో 8.7 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

గొర్రెల షెడ్డుపై తెగిపడిన విద్యుత్ తీగ..

- షార్ట్ సర్క్యూట్‌తో జీవాలు మృత్యువాత



గొర్రెల కళేబరాలు

నెక్కొండ: గొర్రెల షెడ్డుపై 11 కేవీ విద్యుత్ తీగ తెగిపడడంతో షార్ట్ సర్క్యూట్ జరిగి జీవాలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున మండలంలోని పెద్దకొర్పోలులో జరిగింది. గ్రామస్తులు, బాధితురాలు నూకల లక్ష్మి కథనం ప్రకారం.. లక్ష్మి ఇంటి సమీపంలో ఏర్పాటు చేసిన గొర్రెల షెడ్డుపై 11 కేవీ విద్యుత్ లైన్ వెళ్లింది. ఈ క్రమంలో ఇన్సూలేటర్ ఫెయిల్ కావడంతో విద్యుత్ తీగ తెగి పడింది. దీంతో షెడ్డు షార్ట్ సర్క్యూట్‌కు గురవడంతో 18 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటనలో సుమారు రూ. 3 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితురాలు బోరున విలపించింది. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరింది. కాగా, గతంలోనూ ఇళ్ల పైనుంచి వెళ్లిన 11 కేవీ విద్యుత్ లైన్‌ను, ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని పలుమార్లు తెలిపినా అధికారులు స్పందించలేదని గ్రామస్తులు వాపోయారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

జ్ఞానదీపం గద్దెలను తాకిన వరద..

- పొంచి ఉన్న ప్రమాదం



జ్ఞానదీపం గద్దెకు తాకుతూ ప్రవహిస్తున్న వరద

కాళేశ్వరం: మూడు రోజులుగా మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాణహితనది ఉప్పొంగి ప్రవహిస్తోంది. వరద బుధవారం రాత్రి కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద ఏర్పాటు చేసిన జ్ఞానదీపాల గద్దెలను తాకింది. దీంతో దేవస్థాన అధికారులు ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది. ఒక వేళ వరద పెరిగితే ఆ రెండు జ్ఞానదీపాలు వరదల్లో కొట్టుకుపోయే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం త్రివేణి సంగమం సరస్వతీఘాట్ వద్ద 8.480 మీటర్ల ఎత్తులో నీటిమట్టం ప్రవహిస్తోంది. మరింత వరద పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారు.

పెన్షనర్ల బకాయిలు చెల్లించాలి

- సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి



మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

విద్యారణ్యపురి: పెన్షనర్ల బకాయిలు వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు.బుధవారం హనుమకొండలోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.భవిష్యత్‌లో పెన్షనర్లకు పీఆర్సీ, డీఏ లబ్ధిపొందే అవకాశం ఉండదన్నారు. కేంద్రప్రభుత్వం పెన్షనర్లకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గతేడాది మార్చి నుంచి జూన్ 2025 వరకు ఉద్యోగ విరమణ చేసిన వారికి రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వీరస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు సింగారెడ్డి మాట్లాడారు. సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా జి.రాజన్న, మహిళా ఉపాధ్యక్షులుగా ఎన్.సుభాషిణి, ప్రధాన కార్యదర్శిగా కె.దేవదాసు, సహాయ కార్యదర్శులుగా ఎం. మల్లయ్య, ఎం.దేవేందర్‌రెడ్డి, ట్రెజరర్‌గా ఎల్. గోవిందరెడ్డిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఆగయ్య వ్యవహరించారు.

శిక్షణ అభ్యర్థులకు పరీక్షలు



పరీక్షను పర్యవేక్షిస్తున్న అధికారులు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని ప్రభుత్వ కాకతీయ డిగ్రీ కళాశాల ఎదుట గల ప్రభుత్వ వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో కంప్యూటర్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో శిక్షణ పొందిన అభ్యర్థులకు బుధవారం పరీక్షలు నిర్వహించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన సెట్విన్ అధికారులు వనజ, సత్యనారాయణరెడ్డి పరీక్షలను పర్యవేక్షించారు. యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ విజయశ్రీ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. పరీక్ష కేంద్రాన్ని డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్ సందర్శించారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస్, సుమంద సోనీ, సోమ శైలజ, బొడ్డు నితీష, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

SPOKEN ENGLISH

- Spoken English for Teachers DEd/BEd/PGs. Results Guaranteed. Rs. 300/-@BSS GEMS 9494447457, GARLA - Mahabubabad. [WA-6726]

SERVICES

- సిరి అసోసియేట్స్: హౌస్, మార్టిగేజ్, పర్సనల్, ఓపెన్ ప్లాట్స్, రేకుల & గూన పెంకుటిల్లులపై రుణాలు ఇప్పించబడును. సెల్: 9666142226. [SCA25005831]

ఓల్డ్ ఏజ్ హోమ్ కేర్ సర్వీస్

- స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్ / హోమ్ కేర్ సర్వీస్ 24 గం॥ 12 గం॥ వృద్ధులను, పెద్దవారిని, పేషంట్లను, చిన్న పిల్లలను చూసుకోవడానికి మీ ఇంటి వద్దకే అనుభవం గల వర్కర్లని స్త్రీ/పు॥లను పంపించగలము. సంప్ర॥ 8186926067, 8977263124. [WA-6725]

BUSINESS OFFER

- ITR / Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి :7406393937 [HA-480]

WANTED

- అనుభవజ్ఞులైన మహిళా టెలికాలర్ మరియు టైపిస్ట్ కావాలి. జీతం: 10K నుండి 15K బస్టాండ్ రోడ్, హనుమాన్ ఆలయం దగ్గర, HNK. సెల్: 9182375084, 9966653521. [WA-7571]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ. అదనపు లైను 60/- రూ. మాత్రమే 5% GST అదనము

- Wanted Special Educator. B.Ed, HI for a School - JACKSON MISSION SCHOOL. Contact: 8885800489, 7075102777. [SCA25005897]
- Wanted Sales Manager and assistant sales manager in popular mobile stores are preferable. Ph.No: 9133399257, 9703333378 [G-145]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.